# ఉద్యోగ విజయాలు

అనగా అనగా 1970వ దశకంలో భారతదేశంలో, ఎన్నో ఏళ్ళు పరిపాలనలో వున్న పార్టీ ఎలక్షన్లలో ఓడిపోయినప్పుడు ఇంకో పార్టీ ఇంకా కొన్ని చిల్లర పార్టీల భుజాల మీద చేతులు వేసి అధికారంలోకి వచ్చింది. వచ్చిందిబో, కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకుని పరిపాలించవచ్చును కదా. వాళ్ళల్లో వాళ్ళే కొట్టుకు చచ్చారు. చచ్చితిరిబో, సామాన్య ప్రజలని వారి కష్టాలకో సుఖాలకో వారిని వదిలేసి, తమబోంట్ల సంగతులు తామే చూసుకోవచ్చును కదా. వచ్చును. కానీ అలా చేయరు. చేస్తే గవర్నమెంటాలిటీ దెబ్బతింటుంది కదా!

అప్పుడు పదవుల్లోకి వచ్చిన వారిలో మన దురదృష్టవశాత్తూ ఒక కళ్ళున్న కబోది కూడా మంత్రి అయాడు. అతని బుర్ర ఖాళీగా వున్న మ్యూజియంలో పెట్టవలసిన ఖాళీ బుర్ర.

అప్పుడు నేను త్రివేండ్రంలో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న రోజులు. ఈ మంత్రి పుంగవుండు ప్రభుత్వ హోదాలో అక్కడికి వచ్చాడు. వచ్చెనుబో, ఏదో ఒక రాకెట్ లాంచింగ్ చూసి వెనుదిరిగి పోవచ్చు కదా. లేదు. మా అందరి సమయాన్నీ వృధా చేస్తూ ఒక ఉపన్యాసం ఇచ్చాడు.

'ఉపగ్రహాలకనీ టీవీలకనీ సాంకేతికంగా కొన్ని కోట్లు తగలేస్తున్నాం. కొన్ని కోట్లమంది తినటానికి తిండిలేకుండా చచ్చిపోతుంటే మనం ఇలా కోట్లు తగలేయటం అర్థంలేని పని. ఈ కార్యక్రమాలు ఆపేసి ఆ డబ్బుని పేదవాళ్ళకు ఆహారం కోసం కేటాయించటం అవసరం' అని మనవి చేసుకున్నాడు. ఆ డబ్బులు బీదవాళ్ళ తిండికి ఇస్తే వాళ్ళకి డొక్కాడుతుంది అని నొక్కి వక్కాణించాడు. అంత పనీ చేస్తాడేమో అనుకున్నాం మేమందరం. కానీ ఢిల్లీ వెళ్ళే మధ్యదారిలో కాదు కానీ, అక్కడికి వెళ్ళిన కొద్ది రోజుల్లోనే ఆ గవర్నమెంట్ కూలిపోయి ఆయన చరిత్రలో కలిసిపోయాడు. (మళ్ళీ భాజపా గవర్నమెంట్లో మంత్రి అయినా, అతని బుర్ర ఇంకా మ్యూజియంలోనే వుందేమో, ఈసారి తన అజ్ఞానాన్ని బయటపెట్టుకోలేదు)

ఆయన చేసిన గొప్ప పనుల్లో ఐబియం కోక్‌లాటి కంపెనీలను దేశంలో నించీ వెళ్ళగొట్టి ఆ కంపెనీల్లో పనిచేసే కొన్ని వేలమంది ఉద్యోగుల పొట్టలు కొట్టటం, ఇన్సూరెన్స్ కంపెనీలు బాంకులూ కంప్యూటర్లు కొనుక్కోబోతుంటే కంప్యూటర్లు ఉద్యోగాలని మాయం చేస్తాయని ఆధునీకరణని ఆపేయటం. ఇలా చెప్పుకుపోతుంటే చాల వున్నాయి.

తిండి లేని వాళ్ళకి ఇవాళ తిండి పెడితే బాగానే వుంటుంది. కానీ రేపు. మళ్ళీ పెడతాం. ఎల్లుండి? ఎన్నాళ్ళని ఇలా. దానికి బదులు దేశాన్ని పారిశ్రామికంగా

ముందుకు నడిపించి వాళ్ళకి ఉద్యోగాలిస్తే, వాళ్ళ తిండి వాళ్ళే సంపాదించుకుని సగర్వంగా తినరూ! అమెరికాలో ఒకసామెత వుంది. ఆకలిగా వున్నవాడికి చేపలు ఇవ్వకు, చేపలు పట్టుకోవటం నేర్పు అని.

ఉదాహరణకు ఉపగ్రహాలవల్లా, టెలిఫోనులవల్లా, టీవీలవల్లా కబోదిగారు ఆ మాటలన్న రోజునించీ ఇప్పటిదాకా ఎంత తేడా వచ్చిందో చూద్దాం. ఆత్రేయపురం నించీ అమెరికాకే కాకుండా, బుడంపాలెంనించీ బెంగుళూరుదాకా 'కాల్' బుక్ చేసి, కాలు మీద కాలు వేసుకుని పడుకుని నిద్రపోయి మళ్ళీ లేచినా రాని కాలు, ఇప్పుడు డయల్ చేయగానే వస్తున్నది. ఫోన్ కాల్ త్వరితంగా అందితే, పారిశ్రామికరంగంలో, వ్యాపారరంగంలో ఉత్పత్తి పెరుగుతుంది. ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. అలాగే టీవీ కార్యక్రమాలు. శాటిలైట్లు వచ్చాక టీవీ అందరికీ అందుబాటులోకి వచ్చేసింది. దాని వల్ల కొన్ని కోట్ల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఉదాహరణకు ఎన్నో కంపెనీలు టీవీలు తయారుచేస్తున్నాయి. అవి తయారుచేయటానికి, అమ్మటానికీ, సర్వీస్ చేయటానికీ ఎన్నో ఉద్యోగాలు వచ్చాయి. కేబుల్ కంపెనీలు నడిపేవాళ్ళూ, ఆ పరికరాలు తయారు చేసేవాళ్ళూ, ప్రోగ్రాములు ఇచ్చేవాళ్ళూ, నటీనటులూ, రచయితలూ, సాంకేతిక నిపుణులూ.. ఇలా ఎన్నో.. కొత్త ఉద్యోగాలకి అంతులేదు.

నాకు అమెరికా వచ్చాక అర్థమైంది ఎన్ని రకాల ఉద్యోగాలు వున్నాయో. మారుతున్న మానవావసరాల వల్ల ఎన్ని ఉద్యోగ విజయాలు వున్నాయో!

ఏనాడో చదివిన ముళ్ళపూడి వెంకటరమణగారి జోకు బాగా గుర్తుంది. ఒక డాక్టర్‌గారికి నిద్ర పట్టలేదు. తన లాయర్ మిత్రుడికి అర్థరాత్రి ఫోన్ చేశాడు. 'ఒక పేషంటు నాకు డబ్బులు ఇవ్వటం లేదు. అడగటానికి మొహమాటంగా వుంది. ఎలా వసూలు చేయమంటావు?' అని అడిగాడు. లాయర్ మిత్రుడు 'ఏం లేదు. బిల్లు పోస్టులో పంపించు. వెంటనే పంపిస్తాడు' అని సలహా ఇచ్చాడు. అంతేకాదు 'నేను సలహా ఇచ్చినందుకు, రేపు నా బిల్లు పంపిస్తాను. చెక్కు పంపించు' అన్నాడు. ఇది హాస్యానికి బాగానే వున్నా ఉద్యోగ విజయాలకి ఒకచక్కని ఉదాహరణ. ఏ సలహా కూడా మరి ఉచిత సలహా కాదు.

'ఏరా! మీ వూళ్ళో ఏఏ కంపెనీలు ఉద్యోగాలిస్తున్నాయి. ఎక్కడికి పంపించమంటావు అప్లికేషన్' అని అడిగేవాడు మా అప్పారావు.

నాలాటివాడు తెలిసిన సమాచారం ఏదో చెప్పేవాడు. అమెరికాలో అయితే అదో ఉద్యోగం. జాబ్ ప్లేస్మెంట్ కంపెనీ.

'ఇంటర్వ్యూలో ఏం ప్రశ్నలడుగుతారంటావ్? జవాబులు ఎలా చెప్పాలి?'

'ఏముంది బాబూ... అడిగిన దానికి చెప్పటమే జవాబు' కానీ అమెరికాలో అయితే అదో ఉద్యోగం. ఇంటర్వ్యూ కౌన్సెలింగ్.

అలాగే రెస్యూమె.. అంటే సి.వి. తయారు చేయటం.

'ఈ మధ్య నాకు మనసు బాగుండటం లేదు. ఏమిటో జీవితం అంతా వెలితిగా వుంటున్నది'

'చింతపడకు చింతామణీ. నువ్వు డిప్రెషన్‌లో వున్నావు. డేవిడ్‌గారి దగ్గరికి

కౌన్సెలింగ్‌కి వెళ్ళు. తగ్గిపోతుంది'

'మా లాన్‌లో గడ్డి బాగా పెరిగిపోయింది. మా ఆయనకేమో నడుం నొప్పి... ' అంది నళిని.

'ఎందుకు మా అబ్బాయి వున్నాడు కదా. ఇవాళ స్కూలు నించీ రాగానే పంపిస్తాను. చాల చౌకగానే చేస్తాడులే.. ' అన్నాడు చార్లీ.

'ఆదివారం ఆరావుగారినీ, ఈరావుగారినీ, ఆమూర్తిగారినీ, ఈమూర్తిగారినీ ఇంకో కోటిమందినీ భోజనానికి పిలిచాను... ఎలా.. ' అంది కోటేశ్వరి.

'దాందేముంది. నేను మా ఇంట్లో అన్నీ చేసి పంపించనా. హోటల్ కన్నా తక్కువే చార్జ్ చేస్తాలే' అంది కాటరింగ్ కామేశ్వరి.

ఇలా చెపుకుంటూ పోతుంటే చాల కొత్త ఉద్యోగాలు కనిపిస్తాయి. కొత్త అంటే కొత్త కాదు, ఒకప్పుడు ఏదో మంచితనంతోనో, సలహాలాగానో, సహాయం లాగానో చేసినవన్నీ ఇప్పుడు ఉద్యోగాలయిపోయాయి. ఒకప్పుడు అమెరికాలో ఉద్యోగాలుగా వుండి, ఇండియాలో ఉచితంగా వున్నవి, ఇప్పుడు మన దేశంలో కూడా ఉద్యోగాలయిపోయాయి.

కానీ నాకు అనిపిస్తుంటుంది. ఒక ఉద్యోగం మాత్రం ఆనాటికీ ఈనాటికీ మారలేదని. ఉద్యోగం మారకపోవటమే కాదు. జీతం కూడా అసలు పెరగలేదు. జీతం అసలు ఏనాడయినా వుంటేగా, ఇప్పుడు పెరగటానికి. ఆ ఉద్యోగి పేరు గృహిణి. ఆవిడ చేసే ఉచిత అష్టావధానం ఇంతా అంతా కాదు. వంటింటి పని దగ్గరనించి పిల్లల పెంపకం దాకా పనే. రోజూ అందరూ ఎనిమిది గంటల పని చేస్తే (అమెరికా లెఖ్ఖల ప్రకారం), ఈవిడకి కనీసం పదహారు గంటల పని. శనాది వారాలు, పండగ దినాలు శెలవు లేకపోవటమే కాకుండా, ఓవర్ టైం కూడా పని చేయాలి. ఆర్థిక పరిస్థితి బాగున్న గృహిణి అయితే, ఆవిడ పనుల్లో కొన్నిటిని ఔట్ సోర్సింగ్ చేసుకోవచ్చు. ఏవో కొన్ని చేయచ్చు కానీ, అన్నీ ఔట్‌సోర్సింగ్ చేయలేదు కదా! ఇంకొక విచిత్రం. ఏమ్మాత్రం జీతం లేని ఆవిడ చేసే ఉద్యోగానికి డొనేషన్ కూడా కట్టాలి, కట్నం పేరుతో. కులాలని బట్టీ ఆర్థిక పరిస్థితిని బట్టీ, ఆ డొనేషన్ కొన్ని వేలనించీ కొన్ని కోట్ల రూపాయల దాకా వుంటుంది.

ఈమధ్య, అంటే ఈ హైటెక్ రోజుల్లో, ఈ విచిత్రం ఇంకో చిత్రమైన మలుపు తిరిగింది. ఈ ఉద్యోగానికి డొనేషనే కాక, ఓ సాఫ్ట్‌వేర్ డిగ్రీయో మెడికల్ డిగ్రీయో కూడా వుండాలని అడుగుతున్నారు. అలా అయితే ఇటు పుణ్యం, అటు పురుషార్థం దక్కుతాయి ఉద్యోగం ఇచ్చేవాడికి. అంటే అమెరికాలో బై వన్ అండ్ గెట్ వన్ ఫ్రీ అని ఒక రకమైన సేల్ వుంది. ఇండియాలో కూడా వుందేమో నాకు తెలీదు. అదన్న మాట. అంటే మన శివరాత్రికి మారోజుల్లో అర్థరాత్రి పూట సినిమాలు వేసేవాళ్ళు - ఒకే టిక్కెట్టు పై రెండు ఆటలు అని. ఇదీ అలాటిదే

ఈ ఉద్యోగంలోనూ విజయం వుంది. కానీ ఎవరికి?

0 0 0